క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానమని ఏపీజే అబ్దుల్ కలాం బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు చుక్కా సాయినాథ్ రెడ్డి అన్నారు. స్థానిక న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్‌లో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరూ ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చునన్నారు. రక్తదానంపై అపోహలు విడనాడాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ పి.గోవిందరాజు, అచ్చిరెడ్డి, కృష్ణవేణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎంపీపీ అంబళ్ల సుధారాణికు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీడీఓ, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు దంపతులను ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, మండల కార్యాలయ సిబ్బంది గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరాన్ని పురష్కరించుకొని ఎంపీపీ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యోగ సంఘానికి సంబంధించి క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముడుపుల సేవ



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మెంటాడ: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముడుపుల సేవ గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామి వారికి ముడుపులు చెల్లించి, మొక్కులు తీర్చుకున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు 'పారాది' విద్యార్థులు



పోటీలకు పయనమైన విద్యార్థులతో పీడీ వెంకటనాయుడు

బొబ్బిలిరూరల్: జాతీయ స్థాయి పోటీలకు మండలంలోని పారాది గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం పయనమయ్యారు. మహారాష్ట్రలోని జెల్‌గ్రామ్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొనేందుకు బెల్లాన సుప్రియ, భువనేశ్వరిలు బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కారు. అలాగే అదే పాఠశాలకు చెందిన అల్లాడ చైతన్య, చైతన్యకుమారి, దుర్గ, యమున, మౌనికలు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు వెళ్లారు. జాతీయ పోటీల్లో కూడా బాగా రాణించి, మంచి పేరు తీసుకురావాలని పీడీ వెంకటనాయుడు, పాఠశాల సిబ్బంది ఆకాంక్షించారు.

భూ రీసర్వేపై అవగాహన ర్యాలీ

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ గురువారం చేపట్టారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆర్డీవో జేవీ రామ్మోహనరావు పాల్గొని, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామగ్రామాన నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై శిక్షణ

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో రోడ్డు ప్రమాదాల నివారణపై గురువారం శిక్షణ ఇచ్చారు. ప్రమాదాల నివారణలో కీలకమైన ఐరాడ్, ఈడార్ విధానాలను శిక్షణార్థులకు నేర్పించారు. డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఈ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిక్షణ కో–ఆర్డినేటర్ శ్రీధర్, పట్టణ సీఐ కె.సతీష్‌కుమార్, రూరల్ సీఐ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక ప్రణాళిక

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు
- విద్యా సామర్థ్యాలను బట్టి గ్రేడ్లుగా విభజన
- చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి



పూసపాటిరేగ జూనియర్ కళాశాలలో విద్యార్థులు

పూసపాటిరేగ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనే ధ్యేయంగా ఇంటర్ బోర్డు అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. డిసెంబరు ఒకటవ తేదీ నుంచి సంకల్ప 2024 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గతంలో కన్నా పాఠశాల సమయాన్ని పెంచి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. పూసపాటిరేగ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులున్నాయి. నాలుగు గ్రూపులలో కలిసి 166 మంది వరకు విద్యార్థులున్నారు. మొదటి సంవత్సరంలో 102 మంది, రెండో సంవత్సరంలో 64 మంది విద్యను అభ్యసిస్తున్నారు. 100 శాతం ఫలితాలే సాధనే దిశగా ముందుకు సాగుతున్నారు.

ప్రత్యేక తరగతులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు తరగతులు ఉండేవి. ఇప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని సబ్జెక్టులలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులకు అధ్యాపకులు తర్ఫీదు ఇస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. క్వార్టర్లీ పరీక్షలలో వచ్చిన మార్కులు ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా విభజించారు. చదువులో వెనుకబడిన వారికి అధ్యాపకులను కేర్‌టేకర్‌లుగా నియమించి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. కేర్‌టేకర్లకు కేటాయించిన విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం వరకు చదివించడం, రాయించడం చేస్తున్నారు. పాఠ్యాంశాలపై విద్యార్థులకు వచ్చిన సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు..



కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నాం. ప్రత్యేక తరగతులు ప్రతీ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతున్నాయి. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీని వలన వెనుకబడిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి అవకాశం వుంటుంది.

– బమ్మిడి పోలారావు, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి, పూసపాటిరేగ

చాలా ఉపయోగం



కళాశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులు చాలా ఉపయోగం. ప్రతీ రోజు ప్రత్యేక తరగతులతో చదువులో వెనుకబడిన విద్యార్థులపై మరింత శ్రద్ధ చూపి మంచి ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలోనే కార్పొరేట్ కళాశాలలు మాదిరి చదువు చెబుతున్నారు.

– కొణతాల అమూల్య, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని, పూసపాటిరేగ

రెవెన్యూ సదస్సుల్లో తక్షణ పరిష్కారం



విజయనగరం రూరల్: కేఎల్‌పురంలోని రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌ఐ రాజు, తదితరులు



నెల్లిమర్ల రూరల్: తమ్మాపురంలో రైతుల సమస్యలను వివరిస్తున్న సర్పంచ్ భాస్కరరావు

విజయనగరం రూరల్: గడిచిన డిసెంబర్ నెల ప్రారంభం నుంచి మండలంలోని 22 పంచాయతీల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు నేటితో ముగుస్తున్నాయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు అన్నారు. కేఎల్‌పురం కమ్యూనిటీ హాలులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. ఏళ్లనాటి నుంచి పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలకు పరిష్కారం మార్గం చూపించామన్నారు. ఇప్పటివరకూ మూడు వందలకు పైగా వినతులు రాగా 65కు పైగా పరిష్కారానికి నోచుకున్నాయని స్పష్టం చేశారు. మిగతా వాటికి 45రోజుల్లోగా పరిష్కార మార్గం చూపడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక కెఎల్‌పురం, కణపాక కౌన్సిలర్లు మైలపల్లి పైడిరాజు, కోంద్రుశ్రీనువాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేట, తమ్మాపురం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దార్ సుదర్శనరావు ఆధ్వర్యంలో ముందుగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తమ్మాపురం సర్పంచ్ పప్పల భాస్కరరావు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను అధికారులు సకాలంలో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వేణుగోపాలరావు, వీఆర్వోలు సౌజన్య, రవి, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

పొగరహిత వంటకాలకే అనుమతి

విజయనగరం: నగరంలో పొగరహిత వంటకాలు మాత్రమే చేపట్టాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటళ్ల,, తినుబండారాల దుకాణాలు, మిఠాయి తయారీ దుకాణదారులు పొగ రహితంగా వంటకాలను మాత్రమే తయారీ చేపట్టాలని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు ప్రజారోగ్యాన్ని పరిరక్షించే నిమిత్తం కర్రలు, పొట్టు పొయ్యి, వంటి పొగలు వెదజల్లే వాటితో వంటకాలను తయారు చేయరాదని చెప్పారు. కచ్చితంగా కమర్షియల్ గ్యాస్‌ను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. సంక్రాంతి వరకు గడువు విధిస్తున్నామని అనంతరం పొగ వెదజల్లే వంటక కేంద్రాలను గుర్తించి భారీగా అపరాధ రుసుములు విధిస్తామని స్పష్టం చేశారు. పొగ కారణంగా ఇబ్బందులు ఉంటే ప్రజలు తమకు సమాచారం అందించినట్లయితే వెంటనే అటువంటి కేంద్రాల యజమానులపై చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని కోరారు.

20వ డివిజన్‌లో వార్డు పర్యటన



స్థానిక సమస్యలను అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్ తవిటిరాజు

విజయనగరం: విజయనగరంలోని 20వ డివిజన్‌లో మొకర అప్పారావు జంక్షన్ నుంచి గురువారం ప్రారంభమైన వార్డు పర్యటనలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్.తిరుమలరావు పాల్గొన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజుతో కలిసి ఆయన డివిజన్‌లో పర్యటించారు. ముఖ్యంగా బలిజవీధి ప్రాంతంలో ఉన్న ప్రధాన రహదారి మరమ్మతులకు గురైందని దానిని తక్షణమే పునఃనిర్మించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ప్రతి గురువారం వార్డు పర్యటనలు చేపడుతున్నామన్నారు. తమ పర్యటనలో గమనించిన క్షేత్ర స్థాయి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవి పరిష్కారం అయ్యే విధంగా చూస్తామన్నారు. డివిజన్‌లో పర్యటిస్తున్న పరిస్థితుల్లో టిఫిన్ దుకాణాల వద్ద ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని గుర్తించామన్నారు. ఇక నుంచి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించుకోవాలని ఆదేశించామన్నారు. స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ వార్డు పర్యటనలో భాగంగా కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది తమ డివిజన్లో పర్యటించడం ఆనందంగా ఉందన్నారు. డివిజన్‌కు 20 లక్షల రూపాయలు చొప్పున కేటాయించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ సన్యాసినాయుడును సన్మానిస్తున్న సీఐ రామకృష్ణ తదితరులు

పూసపాటిరేగ : విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపు ఇస్తాయని భోగాపురం రూరల్ సీఐ డి.రామకృష్ణ అన్నారు. స్థానిక ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ నుంచి వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ సన్యాసినాయుడు, హెచ్‌సీలు హరిఅప్పారావు, సూర్యారావు, కానిస్టేబుళ్లు రఘు, అప్పలరాజు, వాసులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం కఠినతరమైనది అన్నారు. విధి నిర్వహణలో చేరినప్పటి నుంచి ప్రతి క్షణం పోలీసు ఉద్యోగంలో అప్రమత్తతతో వుండాలి అన్నారు. పోలీస్‌స్టేషన్లలో అందించిన ఉత్తమ సేవలకే పోలీసులకు గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఐ.దుర్గాప్రసాదు, ప్రజాప్రతినిధిలు బాలా అప్పలరాజు, కోట్ల రఘు, మహంతి శివ, పిన్నింటి సన్యాసినాయుడు, పిన్నింటికుమార్, పిన్నింటి ఎల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలోని సాంకేతిక సామర్థ్యాలను గుర్తించాలి

- రాష్ట్ర సమగ్ర శిక్ష ఎంఐఎస్ కోర్డినేటర్ హైమేశ్వరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర సమగ్ర శిక్ష ఎంఐఎస్ కోర్డినేటర్ హైమేశ్వరరావు

విజయనగరం అర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక సామర్థ్యాలను గుర్తించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఆర్.హైమేశ్వరరావు అన్నారు. స్థానిక మహారాజా ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలలో కేజీబీవీ ఉపాధ్యాయులకు పర్సనలైజ్డ్ అడప్టివ్ లెర్నింగ్ అనే అంశంపై గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైమేశ్వరరావు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంకేతిక అంశాలను నేర్చుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రయోగశాలల నిర్వహణ, ట్యాబుల వినియోగం వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఈఓ యు.మాణిక్యంనాయుడు, డిప్యూటీ ఈఓ కేవీ రమణ, జిల్లా నోడల్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపీఓ వి.గోపీచంద్, ఏఎస్‌ఓలు సూర్యారావు, జగన్మోహన్, జి.నాగరాజు, 26 కేజీబీవీ విద్యాలయాల నుంచి 104 మంది ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో 20 అంశాలకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: నగర అభివృద్ధే ధ్యేయంగా సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 20 అంశాలను చర్చించిన అనంతరం సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నూతన సంవత్సర ప్రారంభంలోనే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు శుక్రవారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆదాయ వనరులను పెంచుకొని నగర అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు గూర్చి అందరి సమన్వయంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు, అధికారుల సమన్వయంతో నగర అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రహదారుల పాక్షిక మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. బీటీ, సీసీ రహదారుల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేపట్టేందుకు నిరంతర పర్యవేక్షణ ఉండే విధంగా చూడాలని అధికారులకు సూచించమన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్‌లలో అభివృద్ధి కార్యక్రమాలకు చేపట్టేందుకు రూ.20 లక్షల కేటాయించడం జరుగుతుందన్నారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, సుంకరి నారాయణరావు, రేగాన రూపాదేవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శోభాయమానంగా పాశురఘట్ట ప్రదర్శన



అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు ఆదిమధ్యాంత రహితుడు కలియుగ ప్రత్యక్ష దైవం దేదీప్యమానంగా విరాజిల్లుతున్న స్థానిక రింగు రోడ్డు టౌన్ సెంటర్ లేఅవుట్‌లో వేంచేసియున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 18వ పాశురాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు శ్రీమన్నారాయణచార్య స్వామి పర్యవేక్షణలో భగవద్రామానుజులు నిత్యం తిరుప్పావై అనుసంధానం చేస్తూ భిక్షాటన చేసే ఘట్టాన్ని చిన్నారులు భవ్యశ్రీ, జ్ఞానశ్రీ ప్రదర్శించారు. ఈ విశేషమైన ఉత్సవాన్ని నిర్వహించి గోదాదేవికి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీమన్నారాయణ ఆచార్యులు, రఘునాథాచార్యులు, శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్

క్షయ వ్యాధిపై అవగాహన



క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి కె.సత్యం అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీబీపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. టీబీపై విద్యార్థులంతా పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రెడ్‌క్రాస్ ప్రబోధకులు డాక్టర్ సి.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్షయ లక్షణాల వ్యాప్తి, నివారణపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పీఓలు ఎన్.అప్పారావు, ఎల్.సంధ్య, అధ్యాపకులు డీవీడీ ప్రసాద్, డి.గౌరీ, పి.సుధాకర్ పాల్గొన్నారు.

– నెల్లిమర్ల

కౌన్సెలింగ్‌తో సమస్యల పరిష్కారం



మహిళా కమిషన్‌కు వచ్చిన ఫిర్యాదులను చాలా వరకు కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్టు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గద్దం ఉమ పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె వన్‌స్టాప్ సెంటర్‌ను గురువారం సందర్శించారు. వన్‌స్టాప్ సెంటర్‌లో సౌకర్యాలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. వన్‌స్టాప్ సెంటర్‌కు వచ్చిన దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ సుధారాణి, నోడల్ అధికారి విజయకుమారి, ఎల్ఓ విద్య, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.విజయలక్ష్మి, కౌన్సిలర్ రమాదేవి, కేస్ వర్కర్ రొంగలి వెంకటలక్ష్మి, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్

దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే



ఆధునిక భారతదేశ మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని తెలుగు భాషా సేవా సంఘం వ్యవస్థాపకుడు ఆర్‌బీ రామానాయుడు పేర్కొన్నారు. స్థానిక గాజులరేగలోని ఓ స్కూల్‌లో సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని పలువురు ఉపాధ్యాయులను దుశ్శాలువతో సన్మానించారు. సావిత్రీభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని అందరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్

బ్యాంకర్లు సహకరించాలి

బాడంగి: రుణాల మంజూరుకు బ్యాంకర్లు సహకరించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో గురువారం సమావేశమైన అయన.. ఈ ఏడాది గాను మండలానికి 71 బీసీ, 1 ఈబీసీ రుణ యూనిట్లు మంజూరు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందని, బ్యాంకర్లు తప్పకుండా గ్రౌండింగ్ చేసేలా చూడాలని కోరారు. ప్రతీ పంచాయతీకి 3 యూనిట్లు చొప్పున 25 పంచాయతీలకు అవకాశం కల్పించాలన్నారు.